క్లుప్తంగా

'ఆదర్శ'లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నిడమనూరు: నిడమనూరు ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రంజిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి, 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఫిబ్రవరి 15 లోగా https://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య, 7 నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దేవరకొండ: దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఈటీలతో పాటు బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 3వ తేదీ లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

విరాట్ పారాయణానికి ముమ్మరంగా ఏర్పాట్లు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో బుధవారం నిర్వహించనున్న శ్రీభీష్మైకాదశ ప్రయుక్త శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర విరాట్ పారాయణ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ కన్వీనర్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ పరిశీలిస్తున్నారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ, రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో అహోబిలం రామానుజ జీయర్ స్వామి, దేవనాథ రామానుజ జీయర్ స్వాముల సమక్షంలో పారాయణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు హాజరవుతారని అన్నారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా జయలక్ష్మి



దేవరకొండ: జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా దేవరకొండ పట్టణానికి చెందిన చెరుపల్లి జయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ సోమవారం జయలక్ష్మికి నియామక పత్రం అందించారు.

గుంటుకగూడెం ఉప సర్పంచ్‌గా శంకరయ్య

నిడమనూరు: మండలంలోని గుంటుకగూడెం ఉప సర్పంచ్‌గా 4వ వార్డు సభ్యుడు గుడిసె శంకరయ్య ఎన్నికైనట్లు ఎంపీడీఓ ప్రమోద్ కుమార్ ప్రకటించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన వార్డు సభ్యులు శంకరయ్యను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్‌గా గెలిచిన గన్నెపాక స్వామి ఎనిమిది నెలలకే అనారోగ్యంతో మృతిచెందగా, ఉప సర్పంచ్ అక్కి సరిత అప్పటి నుంచి తాత్కాలిక సర్పంచ్‌గా వ్యవహరించారు. ఇటీవల ఆమెపై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. దీంతో సర్పంచ్ పదవి కూడా ఖాళీగా ఉంది. కాగా శంకరయ్యను జనవరి 9న తాత్కాలిక సర్పంచ్‌గా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామలింగయ్య, వార్డు సభ్యులు, కార్యదర్శి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



దామరచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మిర్యాలగూడ: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ యూనివర్సిటీలను అభివృద్ధి చేయకుండా ప్రైవేట్ యూనివర్సిటీలను అందలం ఎక్కిస్తుందని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలన్నారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేయాలనే కుట్రలో బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, నాయకులు వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, ఖమ్మంపాటి శంకర్, కొర్ర సైదానాయక్, బుడిగె వెంకటేష్, కోరె రమేష్, రేణుక, వదూద్, ధీరావత్ వీరన్న, సూర్య, పుట్ట సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి జీవితం ఆదర్శనీయం



హాలియా: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



దేవరకొండ: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



చింతపల్లి: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలునాయక్, బిల్యానాయక్



కొండమల్లేపల్లి: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



నాగార్జునసాగర్: పైలాన్‌కాలనీలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అనుముల మండల ఆర్యవైశ్య సంఘం, హాలియా గ్రేటర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అనుముల మండల అధ్యక్షుడు వీరమల్ల కృష్ణయ్య, గ్రేటర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు బచ్చు సతీష్ మాట్లాడుతూ.. గాంధీ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గణేష్, కోశాధికారి పాంపాటి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు చీదెళ్ల లింగయ్య, మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి వాసులు, సాయి మందిరం అధ్యక్షుడు తేలప్రోలు శేఖర్, వాసవి క్లబ్ సెక్రటరీ సముద్రాల అరవింద్, కోశాధికారి శ్రీధర్, జోనల్ చైర్మన్ కొండూరు శోభన్‌బాబు, పాస్ట్ డిప్యూటీ గవర్నర్ పాంపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా స్థానిక ఆల్ఫా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో గాంధీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మంజులత నివాళులర్పించారు. మండలంలోని చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో గాంధీ చిత్రపటానికి హెచ్ఎం దాసా వెంకన్న నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ యూనూస్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్, ఎండీ ఉమేర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని గాంధీ విగ్రహానికి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాసా వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ నివాళులర్పించారు. కార్యక్రమంలో జంగయ్య, కొత్త సుబ్బారావు, సముద్రాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో...

కొండమల్లేపల్లి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ధనుంజయ్య, వీరమళ్ల వెంకటయ్య, కిరణ్‌కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మహాత్మా గాంధీ వర్ధంతిని మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, పార్టీ నాయకుడు బిల్యానాయక్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, అంగిరేకుల గోవర్ధన్, కాసారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీలో గల గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జంగయ్య, నాగరాజు, రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉంగరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంభ భవాని లిఫ్టుతో సస్యశ్యామలం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట: అంభ భవాని లిఫ్టుతో నేరెడుగొమ్ము మండలం సస్యశ్యామలం కానుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని మోసంగడ్డతండా, కొత్తపల్లి గ్రామాల్లో రూ.50లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.185 కోట్లతో అంభ భవాని లిఫ్టు పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం కొత్తపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మహిళకు కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మ, సర్పంచ్ లోకసాని తిరుపతయ్య, బావోజీ, అంజయ్య, కోఆప్షన్ సభ్యుడు పాషా, పీఏసీఎస్ చైర్మన్ ముక్కమల చిన బాలయ్య, పల్స వెంకటయ్య, చెన్నానాయక్, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బీఆర్ఎస్‌లో చేరికలు..

కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మెగావత్‌తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్

హాలియా: అంధత్వ నివారణకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం అనుముల మండలంలోని చింతగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడలేని విధంగా కేవలం తెలంగాణలో మాత్రమే కంటి వెలుగు వంటి వినూత్న కార్యక్రమం అమలవుతుందని అన్నారు. అంధులు లేని తెలంగాణ రాష్ట్రంగా నిర్మించేందుకు సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అదేవిధంగా హాలియా పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో తిరుమలగిరి మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, అనుముల, తిరుమలగిరి మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, సర్పంచ్ కూరాకుల లింగమ్మరామయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కొండా రమేష్, సర్పంచ్‌లు వెంకట్రామ్‌రెడ్డి, విజయ్, రాములు, నారాయణరెడ్డి, బిళ్లకంటి శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చింతగూడెంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

క్యాలెండర్ ఆవిష్కరణ

హాలియా: జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం హాలియా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) మండల ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు నిరంజన్, కన్వీనర్లు డాకునాయక్, రాజు, వివిధ మండలాల అధ్యక్షులు రియాజ్, ఉపేందర్, జాన్ తదితరులు ఉన్నారు.



హాలియా: పంచాయతీ కార్యదర్శుల సంఘం క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

ఎమ్మెల్సీ కోటిరెడ్డికి వినతి

మిర్యాలగూడ: ఎంపీటీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.

బీఆర్ఎస్‌లోకి బెజ్జికల్ సర్పంచ్

త్రిపురారం: మండలంలోని బెజ్జికల్ గ్రామ సర్పంచ్ గజ్జల కోటిరెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం గ్రామంలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఎమ్మెల్సీ కోటిరెడ్డి సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఎంపీపీ భగవాన్‌నాయక్, బెజ్జికల్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అలుగుబెల్లి వెంకన్న, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మించాలని పాదయాత్ర

మిర్యాలగూడ: మాడ్గులపల్లి మండలంలోని పాములపహాడ్ నుంచి మాడ్గులపల్లి మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. డబుల్ రోడ్డు నిర్మించాలని సోమవారం నిర్వహించిన పాదయాత్రలో వారు పాల్గొని మాట్లాడారు. మాడ్గులపల్లి–పాములపహాడ్ వరకు 18కి.మీ. మేర, అదనంగా మరో 4కి.మీ. భీమారం వరకు డబుల్ రోడ్డు వేయాలన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, నకిరేకల్ నియోజకవర్గాలకు ఈ రోడ్డు ప్రధానమైందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాదూరి శశిధర్‌రెడ్డి, చౌగాని సీతారాములు, వేములపల్లి వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, శ్రీకర్, అశోక్‌రెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, తంగెళ్ల నాగమణి, రెమడాల భిక్షం, బొంగర్ల వెంకటయ్య, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ఉపాధి హామీ రికార్డులు సమర్పించడంలో జాప్యం

- వెనుదిరిగిన ఆడిట్ బృందం
- 4రోజులు గడువు కోరిన చందంపేట ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

చందంపేట: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2019 అక్టోబర్ 10 నుంచి 2022 మార్చి 31 వరకు చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు ఆడిట్ బృందం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చింది. అయితే ఇప్పటి వరకు 44శాతం రికార్డులు మాత్రమే సమర్పించిన అధికారులు పూర్తి స్థాయి రికార్డులు మాత్రం ఆడిట్ బృందానికి ఇవ్వలేదు. పదకొండు రోజులవుతున్నా పూర్తిస్థాయి రికార్డులు సమర్పించకపోవడంతో ఆడిట్ బృందం సోమవారం మరో మండలానికి వెళ్లింది. ఆడిట్ బృందానికి రికార్డులు సమర్పించేందుకు నాలుగు రోజులు గడువు ఇవ్వాల్సిందిగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి పీడీకి అర్జీ పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన పీడీ నాలుగు రోజులు గడువు ఇచ్చారు. మరీ ఈ నాలుగు రోజుల్లో రికార్డులు అందజేస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

ప్రజా సమస్యలపై పోరాటం

డిండి: ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అంజయ్య నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని శేషాయికుంటలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ వేడుకలకు ఆయన హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని రంగుండ్ల తండా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా వ్యవహరించి బాధ్యతలు నిర్వర్తించారు. కలెక్టర్‌గా ఏ. కార్తీక్, డీఈఓగా ఆర్. మిథున్, ఎంఈఓగా ఏ. రాము, ఎస్ఎంసీ చైర్మన్‌గా ఏ. అభిలాష్, హెచ్ఎంగా ఆర్. రమ్య వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సరోజినిదేవి, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, హాము, విజయలక్ష్మి, యశోద, జానీపాషా, రామాంజిరెడ్డి, నాగమణి, రవీందర్ బాబు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

మిర్యాలగూడ టౌన్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గల క్లియో స్పోర్ట్స్ ఎరీనాలో ఇంటర్ స్కూల్ క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో క్లియో స్పోర్ట్స్ ఎరీనా మేనేజింగ్ డైరెక్టర్ ఏచూరి హర్ష, కోచ్‌లు మారబోయిన రామకృష్ణ, రాజు, కౌన్సిలర్ ఉదయ్ భాస్కర్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను పరిశీలించిన ఆర్డీఓ

అడవిదేవులపల్లి: మండలంలోని ఉల్సాయిపాలెంలో గల సర్వే నంబర్ 145లోని 1610 ఎకరాల ప్రభుత్వ భూమిని సోమవారం మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో కబ్జా ఉన్న రైతులకు న్యాయం చేస్తానని అన్నారు. మూడు టీంలతో సర్వే నిర్వహించి త్వరితగతిన ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని అన్నారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు, ఆర్ఐ ఠాగూర్ రామకృష్ణ, సర్వేయర్ నాగార్జున తదితరులున్నారు.

అంధకారంలో ఉద్యోగుల భవిష్యత్తు

మిర్యాలగూడ అర్బన్: వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన కంపెనీల్లో అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలు సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తును అంధకారంలో నెట్టేలా ఉన్నాయని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బొమ్మనబోయిన శ్రీనివాస్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన డబ్బును గౌతమ్ అదానీ కంపెనీల్లో ఎస్‌బీఐ, ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టాయని, ఇప్పుడు ఆ కంపెనీల షేర్లు పతనం కావడంతో దేశంలోని 84 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల సొమ్ము ఆవిరైపోయిందని ఆరోపించారు. అనేక రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నారని, తెలంగాణలో కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నారయణరావు, ప్రేమానందం, పిచ్చయ్య, జానకయ్య తదితరులున్నారు.

బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖలు పంపించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో లింగంగౌడ్ మాట్లాడుతూ.. బీసీ వర్గానికి చెందిన మోదీ ప్రధానమంత్రి హోదాలో ఉండి కూడా బీసీలకు ఏవిధమైన రాజ్యాంగ ఫలాలు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, సందెనబోయిన జయమ్మ, బంటు కవిత, గుండెబోయిన నాగేశ్వర్ రావు, ఎర్రబెల్లి దుర్గయ్య, జయరాజు, మురళియాదవ్, సావిత్రి, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

చింతపల్లి: మండల పరిధిలోని గొడుకొండ్ల, పోలేపల్లి రాంనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, పార్టీ నాయకుడు కేతావత్ బిల్యానాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గొడుకొండ్ల గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఖలీల్ బేగ్, ప్రధాన కార్యదర్శిగా మొగుతాల మహేశ్, కోశాధికారిగా పాలకుర్ల రాజేశ్, పోలేపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా పి. శంకర్, ప్రధాన కార్యదర్శిగా కర్నెకంటి కుమార్, కోశాధికారిగా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, దొంతం సంజీవరెడ్డి, ఎంపీపీ భవానీపవన్‌కుమార్, గడ్డం పురుషోత్తంరెడ్డి, అంగిరేకుల గోవర్ధన్, వెంకటయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, నర్సింహారెడ్డి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు నివాళి

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బండారు నాగరాజు గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి నాగరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, సంపత్‌కుమార్, నాగరాజు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మంద రఘువీర్, కౌన్సిలర్ రామకృష్ణ, టౌన్ కార్యదర్శి భూషరాజుల కృష్ణయ్య, ఆదాసు విక్రం, ఊరశ్రీనివాస్, ధర్మారెడ్డి, కోట్ల సైదులు, అర్జున్, శివ, తిరుమలగిరి(సాగర్) ఎంపీపీ భగవాన్ నాయక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్, డాకునాయక్, మోహన్ నాయక్, రాజు, రియాజ్, ఉపేందర్, రమేష్, జాన్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నిత్యావసర సరుకులు అందజేత

మిర్యాలగూడ: మాడ్గులపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన విక్టరీ వెంకటేష్ అభిమాని ఆవుల రవి మామ సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సైదులు కుటుంబ సభ్యులకు వెంకటేష్ అభిమానులు సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆదిమళ్ల మధు, తవిటి సైదులు, గార్లపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆవుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 15 వరకు వివిధ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హవిల్ కుమార్, రవికుమార్, లక్ష్మయ్య, ప్రేమలతరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని కాల్వపల్లి గ్రామంలో గల ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు పంచాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి కాల్వపల్లిలోని ప్రభుత్వ భూములను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లకముందే ప్రభుత్వం పేదలకు పంచాలని కోరారు. ఆయన వెంట నాయకులు సోతుగంటి కాశీ, కిరణ్, రాంబాబు, రాజు తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నిడమనూరు: మండలంలోని ఊట్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం పీఏసీఎస్ డైరెక్టర్ కేశబోయిన జానయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి, ఎంపీటీసీ రాధ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సాగులో సేంద్రియ ఎరువులు వాడటం వలన రైతులు అధిక లాభాలు పొందవచ్చిన, సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భరత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వర్మీ కంపోస్ట్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ.. వర్మీ ఎరువు పండ్ల తోటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ, ఏపీఓ నాగేశ్వరావు, సీఆర్‌సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్, నకిరేకల్ క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, టీఏ నర్సింహా చారి, శ్రీరాములు పాల్గొన్నారు.

2177 మందికి కంటి పరీక్షలు

పెద్దవూర: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో ఇప్పటివరకు 2177 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి నగేష్ తెలిపారు. మండలంలో రెండు బృందాలు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిర్సనగండ్ల, బట్టుగూడెం, లింగంపల్లి, తెప్పలమడుగు గ్రామాలలో ఈ కార్యక్రమం పూర్తైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు 277 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని, మరో 163 కళ్లద్దాలకు ఆర్డర్ పెట్టినట్లు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

దేవరకొండ: దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటి పరిధిలో లే-అవుట్లకు సంబంధించి పలు అంశాలను ఆయా వార్డుల కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో కమిషనర్ వెంకటయ్య, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

నాగార్జునసాగర్: గ్యాస్ స్టవ్‌పై వంటచేసే సమయంలో కలిగే ప్రమాదాలు, నివారణ చర్యలపై నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల కృష్ణవేణి పాఠశాలలో ఇండేన్ గ్యాస్ ఈఓ వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 20 వరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు యాదిలాల్, మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ రేఖాశ్రీధర్‌రెడ్డి స్నాక్స్(అల్పాహారం) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మంద సత్యనారాయణ, సముద్రాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నల్ల నరసింహులు, సీతారాం, మంగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్నాక్స్ అందించేందుకు ఆర్థికసాయం

పెద్దవూర: ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళ స్నాక్స్ అందించేందుకు నాగార్జునసాగర్‌లోని హిల్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పి. స్వరాజ్యకుమారి ముందుకొచ్చారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'విద్యార్థులకు స్నాక్స్ అందించరూ!' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె. శ్రీనివాస్‌కు రూ.10వేలు అందించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వరాజ్యకుమారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై నిర్లక్ష్యం

మిర్యాలగూడ అర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని విజేత కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలగోని వెంకటేశ్‌గౌడ్, నాయకులు హరినాయక్, నవీన్, శివ, సుభాష్ తదితరులున్నారు.